క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ముంజేరు విద్యార్థి


రాంబాబుతో ఉపాధ్యాయులు

భోగాపురం: వారణాసిలో డిసెంబర్ 10 నుంచి 14 వరకు జరగనున్న జాతీయ స్థాయి వాలీ బాల్ పోటీలకు మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి శీల రాంబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు రాం బాబును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రమణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు సింగిడి నాగన్న తదితరులు మంగళవారం అభి నందించారు.

పోస్టర్ ఫ్రీనగరంగా విజయనగరం


విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: పోస్టర్ ఫ్రీ నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, పోస్టర్‌లను తొలగించే చర్యలు మంగళవారం చేపట్టారు. నగరంలో విచ్చలవిడిగా పోస్టర్లు, గోడలపై రాతలు చేపడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా మార్పు రావటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు అనుమతులు లేని ఫ్లెక్సీలను, పోస్టర్‌లను తొలగిస్తున్నప్పటికీ ప్రజల్లో మార్పు రావటం లేదన్నారు. ఇకపై అటువంటి పోస్టర్‌లు, ఫ్లెక్సీలను పెట్టిన సంస్థలపై, వ్యక్తులపై అపరాధ రుసుం విధించి వారితోనే తొలగింపజేస్తామని హెచ్చరించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత


పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది

భోగాపురం: మండలంలోని కవులవాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పల్లా పిన్నింటి శ్రీను అనే వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రమోహన్ అధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిందితుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాటు వేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడు నుంచి 38 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో హెచ్‌సీ సత్యనారాయణ, కానిస్టేబుల్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

విజయనగరం క్రైమ్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవ్వడం, ఇతర వాహనాలను ఢీకొట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అటువంటి వారిని ప్రతీరోజూ విజిబుల్ పోలీసింగ్‌లో ప్రత్యేకంగా డ్రైవ్ చేపడుతున్నామన్నారు. గజపతినగరం సర్కిల్‌లో ఆరుగురిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారని, మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చారమన్నారు. ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున మెజిస్ట్రేట్ బి.కనకమహాలక్ష్మి జరిమానా విధించారన్నారు. తమపై ఆధారపడి జీవించే భార్య, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు గురించి ఆలోచించాలని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారన్నారు.

బంగారం దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ

విజయనగరం క్రైమ్: స్థానిక జగన్నాథస్వామి ఆలయం వద్ద బంగారం పని చేసే వర్తకుల షాపును విరగ్గొట్టి బంగారాన్ని చోరీ చేసిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథస్వామి ఆలయం సమీపంలో గోల్డ్‌స్మిత్ పని చేస్తున్న వర్తకులు గత నెల 12న రాత్రి రోజూలాగే తమ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. మరుసటి రోజు చూసేసరికి షాపు షట్టర్ తాళాలు బద్దలు కొట్టి ఉండడం గమనించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన రాళ్ల మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు ఇప్పిలి శ్రీను పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. మహేష్ నుంచి ఐదు గ్రాముల గోల్డ్‌ను రికవరీ చేశామన్నారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు, హెచ్‌సీ అచ్చిరాజు తదితరులు ఉన్నారు.

లింక్ లేకుంటే రాయితీ రానట్టే..

- బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈ నెల 6 నుంచి ప్రారంభమైన ప్రక్రియ


వార్డు సచివాలయంలో ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ చేస్తున్న సిబ్బంది

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) లింక్ తప్పనిసరి చేసింది. ఇటీవల వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకు ఉన్న ఖాతాలు లేకపోవటంతో ప్రభుత్వం నుంచి వారికి పథకాలు అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో ఎన్‌పీసీఐ లింకులు లేని ఖాతాల జాబితాలను ఆయా ప్రాంతాల వారీగా పంపించింది. ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం మనుగడలో లేని ఖాతాలను తెరిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీలోగా పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

విజయనగరం నియోజకవర్గంలో పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలతో పాటు కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లలో నివాసముంటున్న వారికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ వాటికి ఎన్‌పీసీఐ లింకు లేనట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను డిజిటలైజేషన్ చేయాలని ఈ నెల 6వ తేదీన కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండిన వారంతా పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలను తెరవాలని చెబుతున్నారు. దీనిపై ఆయా సచివాలయ పరిధిలో వెల్ఫేర్, డిజిటల్, సర్వేయర్లు, అగ్రికల్చర్ సిబ్బంది సిద్ధం చేశారు. సచివాలయ సిబ్బంది ఇచ్చిన యాప్‌లో ఆయా ఖాతాలకు ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం వారి ఖాతాకు సంబంధిత బ్యాంకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతా మనుగడలో ఉండాలి. కొందరికి రెండు, మూడు బ్యాంక్ ఖాతాలు ఉండి వాటిలో కొన్ని వినియోగంలోకి లేకపోవటంతో సమస్యలు వస్తున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి మనుగడలో లేని ఖాతాల వివరాలు పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టింది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 40వేలకు పైగా ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్లు గుర్తించాం. వారందరికీ సమాచారం అందించి లింక్ చేసుకోవాలని సూచిస్తున్నాం.

– పి.నల్లనయ్య, కమిషనర్ విజయనగరం కార్పొరేషన్

పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి


గాజులరేగ ప్రధాన రోడ్డులో పేరుకుపోయిన పూడికల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్

విజయనగరం: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో చేపట్టిన డివిజన్ పర్యటనలో భాగంగా క్షేత్ర స్థాయిలో స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సిబ్బందికి మంగళవారం ఆదేశించారు. గాజులరేగ ఆర్చ్ నుంచి ప్రారంభమైన పర్యటనలో ప్రధానంగా కాలువలు అనుకుని ఉన్న పైప్‌లైన్‌లను తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సకాలంలో నీటి సరఫరా జరుగుతుందా.. లేదా.. అని స్థానికంగా మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో రెండు వాటర్ ట్యాంక్‌లను పరిశీలించాలని అవసరమైతే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో సంతాన నిరోధక చికిత్సలు చేయించాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. గాజులరేగ విశిష్టత తెలిసే విధంగా నామ ఫలకాన్ని ఏర్పాటు చేయాలన్నారు .కాలువల్లో పూడిక పేరుకుపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ తక్షణమే తొలగింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, డీఈలు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'ఉల్లాస్' శిక్షణ

విజయనగరం అర్బన్: వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 27 మండల పరిషత్ కార్యాలయాలలో ఉల్లాస్ కార్యక్రమాలపై ఈ నెల 13, 14వ తేదీలలో సిబ్బందికి శిక్షణ నిర్వహిస్తామని ఆ శాఖ ఉప సంచాలకులు ఎ.సోమేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన జరిగే ఈ శిక్షణ తరగతులకు మండల పరిధిలోని వెలుగు సీసీలు, వీఓఏలు, వలంటీర్ టీచర్స్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులను మండల స్థాయి కమిటీ సభ్యులు, వెలుగు ఏపీఎం, ఎంఈఓ, సీడీపీఓ (ఐసీడీఎస్) అధికారులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీల్లో వార్డెన్లను నియమించాలి

విజయనగరం అర్బన్: సమగ్ర శిక్ష శాఖ నిర్వహణలోని కేజీబీవీ విద్యాలయాలలో వార్డెన్ వ్యవస్థను తీసుకురావాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ప్రతి కేజీబీవీలలోనూ ఒక వార్డెన్, ఒక డిప్యూటీ వార్డెన్‌ని నియమించాలని సూచించారు. కేజీబీవీల్లోని ఒకేషనల్ గెస్టు టీచర్లకు కూడా మినిమం టైమ్ సాలరీ (ఎంటీఎస్) మంజూరు చేసి సిబ్బంది అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ పీజీటీలు 1120 మందిని కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందే వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో మంగళవారం ఉదయం ఆయన తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రీవెన్స్‌ల పరిష్కారంపై సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతుల పరిష్కారంలో అంత జాప్యం ఎందుకు జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తిస్థాయి పరిష్కారం చూపాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తీవ్రజాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విధించిన నిర్ణీత గడువుకు పదిరోజుల ముందుగానే ఆ సమస్యను పరిష్కరించి తమకు నివేదిక పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

భోగాపురంలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న సీఐ ప్రభాకర్

భోగాపురం: మండల కేంద్రంలోని బొల్లు వీధిలో చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భోగాపురంలో బొల్లువీధికి చెందిన కొమ్మూరు శారద వారం రోజుల కిందట కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు విజయనగరంలో నివాసముంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఇంట్లో పని మనిషి రోజు ఇంటికి వచ్చి మెయిన్ డోర్ తాళం తీసి ఇల్లును శుభ్రం చేసి వెళ్లి పోతుండేది. అయితే ఆది, సోమవారం రెండు రోజుల పాటు పని మనిషి ఇంటి పనులు చేయడానికి రాలేదు. మంగళవారం పని మనిషి ఇంటికి వచ్చి తాళం తీసి రోజువారి లాగానే ఇంటిని శుభ్రం చేస్తుండగా లోపలి గదులు తాళాలు పగలుగొట్టి ఉండడం గమనించి ఫోన్ ద్వారా శారదకు సమాచారం తెలిపింది. సమాచారం అందుకున్న శారద ఇంటికి వచ్చి చూడగా ఇల్లు లోపల ఉన్న 5 బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇందులో తెరిచి ఉన్న ఇనుప బీరువాను వెతకగా బీరువాలో ఉన్న పావు తక్కువ మూడుతులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్వీ ప్రభాకర్ సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, పలు ఆధారాలు సేకరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన కర్రి ఆదిలక్ష్మి(58) విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాండ్రంగి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ఈ నెల 6వ తేదీన ఉచిత గ్యాస్ పథకం కోసం ఈకేవైసీ చేసుకునేందుకు తన కుమారుడు సూరిబాబుతో కలిసి బైకుపై భోగాపురం వచ్చింది. భోగాపురంలోని శ్రీసాయి దుర్గా గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ చేయించుకుని తిరిగి కుమారుడుతో కలిసి పాండ్రంగి బయలు దేరారు. మార్గం మధ్యలో సవరవల్లి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో కుమారుడు సూరిబాబు అక్కడికక్కడే చనిపోయాడు. తల్లి ఆదిలక్ష్మి తీవ్ర గాయాల పాలైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన ఆదిలక్ష్మిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ఆదిలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ టీఎస్ఏన్ రాజు తెలిపారు.

స్థల పరిశీలన

భోగాపురం: భోగాపురం, భీమిలి సరిహద్దులో ఉన్న సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో అత్యాధునికంగా హోటల్ నిర్మించేందుకుగాను గత ప్రభుత్వం ఒబేరాయ్ సంస్థ ప్రతినిధులకు భూమిని కేటాయించింది. ఆ హోటల్‌కు సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం విశాపట్నం ఆర్‌డీఓ ఎస్.మధు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో భోగాపురం మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సాయంలోనే సంతృప్తి

విజయనగరం ఫోర్ట్: పేదలకు పట్టెడు అన్నం పెట్టడంలో సంతృప్తి ఉందని వ్యాపారవేత్త నాగమల్లి గణపతిరావు అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 100 మంది పేదలకు బియ్యం, గోధమనూక, వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 15 ఏళ్లగా మారుతీ సంఘం వారు పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమానికి ప్రతీ ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెంట పాటి మార్కండేయులు, పెంటపాటి రాము, గుత్తురూ చంద్రశేఖర్, సిహెచ్.అప్పలస్వామి, రామ్మోహన్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'రియల్' మోసం

- ప్లాట్లు నిర్మించి ఇస్తామని లక్షల్లో వసూలు చేసి దగా
- మోసపోయామంటూ బాధితుల ఆవేదన


ఖాళీ చెక్కులు, ప్రాంసరీ నోట్లు, అగ్రిమెంట్ పేపర్లను విలేకరుల సమావేశంలో చూపిస్తున్న బాధితులు

భోగాపురం: మండలానికి చెందిన ఓ వ్యక్తి రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు నిర్మించి ఇస్తామని లక్షలు కాజేసి చివరికి ప్లేటు ఫిరాయించడంతో పలువురు బాధితులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి వారి గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులైన విజయనగరం పట్నానికి చెందిన ఎల్‌ఐసీ రిటైర్డ్ ఉద్యోగి జామి వెంకట నాగరాజు(రూ.6.8 లక్షలు), డెంకాడ గ్రామానికి చెందిన ఆర్ కృష్ణవేణి (రూ.10 లక్షలు), రఘుమండ గ్రామానికి చెందిన పిల్లా నానాజీ (రూ.5 లక్షలు)లు మాట్లాడుతూ భోగాపురం మండలంలోని నారుపేట గ్రామానికి చెందిన నారు అప్పలరాజు 2013లో విజయనగరంలోని జమ్మునారాయణపురంలో ఒక సైట్‌లో ప్లాట్లు నిర్మిస్తున్నానని మీకు తక్కువ ధరకే పాట్లు ఇస్తామని చెప్పి లక్షలు వసూలు చేశాడని ఆరోపించారు. తామంతా బాధ్యత కలిగిన ఉద్యోగాలు చేస్తూ ఆ వ్యక్తిని నమ్మి డబ్బులు ఇచ్చామని, తీరా సంబంధిత ప్లాట్ల వద్దకు వెళ్లి చూస్తే తమకు ఇస్తామన్న ప్లాట్లలో వేరే వారు ఉంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ప్లాట్లు నిర్మించి ఇస్తామని మా దగ్గర నుంచి లక్షల్లో డబ్బు వసూలు చేసి అగ్రిమెంట్ కూడా రాసి ఇప్పుడు వేరే వాళ్లకు ప్లాట్లను ఎలా రిజిస్ట్రేషన్ చేశావంటూ బాధితులు గతంలోనే ప్రశ్నించగా అప్పలరాజు స్పందిస్తూ మీ దగ్గర వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని చెప్పి ఖాళీ చెక్కులతో పాటు ప్రాంసరీ నోట్లపై సంతకాలు చేసి బాధితులకు ఇచ్చాడు.

మొండికేసిన నిందితుడు

ఎంతకీ ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు మళ్లీ అప్పలరాజు ఇంటికి వెళ్లి డబ్బులైనా ఇవ్వు లేదా ప్లాట్‌లైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేను ఎవ్వరికీ డబ్బులు కానీ ప్లాట్లు కానీ ఇవ్వనని..మీకు నచ్చిన పని చేసుకోండని ముఖం మీద చెప్పడంతో బాధితులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి తమకు తగిన న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. తమలా ఇంకెవరూ ఇలాంటి మాయగాడి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు చెప్పారు.

17న నాగవంశీయుల కార్తీక సమారాధన


నాగవంశీయుల వన సమారాధన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

విజయనగరం: విజయనగరం నాగవంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్ వెల్లడించారు. మంగళవారం నగరంలోని సంఘం భవనంలో వన సమారాధనకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా నిర్వహించే కార్తీక సమారాధన కార్యక్రమంలో 10, ఇంటర్ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయటం జరుగుతుందన్నారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు కల్యాణ వేదిక కార్యక్రమం నిర్వహించటం ద్వారా పెళ్లికాని నాగవంశ యువతీ, యువకుల వివరాలు సేకరించి, భవిష్యత్‌లో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం దివంగత అవనాపు సూరిబాబు జ్ఞాపకార్థం వారి కుమారులు అవనాపు విక్రమ్, విజయ్, జనార్ధనరావు సోదరులు అంతిమయాత్ర వాహనాన్ని సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో భూములు లాక్కొనే కుట్ర

- ఏపీసీసీ మైనారిటీ వైస్ చైర్మన్ హుస్సేన్ షరీఫ్


సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ షరీఫ్

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు పేరుతో ముస్లింలు అల్లాహ్ మార్గంలో త్యాగం చేసినటువంటి లక్షల ఎకరాల భూములను, రూ.లక్షల కోట్ల ఆస్తులను జప్తు చేసుకునే దురుద్దేశంతో అడుగులు వేస్తుందని ఏపీసీసీ మైనారిటీ వైస్ చైర్మన్ హుస్సేన్ షరీఫ్ అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సవరణ పేరుతో ముస్లింల అధీనం నుంచి వాటిని లాక్కొని ముస్లింలకు ఏమాత్రం హక్కు లేకుండా చేసి వాటిని బడాబాబులకు అప్పజెప్పే అధికారిక కుట్ర జరుగుతుందని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులను, వక్ఫ్ బోర్డును కాపాడుకోవాలన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం చెందకుండా న్యాయ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ ఖలీల్, అబ్దుల్ రెహమాన్, ఎస్.కె.సమీర్, ఎస్.కె.మక్బుల్, ఎస్.కె సిలర్, నూరిబేగం తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్


నీటి పన్ను వసూళ్లలో కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగు నీటి పన్ను చెల్లించకుంటే కుళాయి కనెక్షన్ కట్ చేయనున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం నీటి పన్నుల వసూళ్లకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కార్పొరేషన్ సిబ్బంది బకాయిదారులకు వద్దకు వెళ్లి పన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇందుకోసం నియమించిన ప్రత్యేక సిబ్బందితో పాటు సచివాలయ కార్యదర్శులు వసూళ్లకు చేపడుతున్నారని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారంతా విధిగా పన్ను మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. నగర ప్రజలకు తాగునీటిని అందించే కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కోట్లాది రూపాయలు వ్యయం చేయటం జరుగుతుందని, ఆర్థిక భారం పడకుండా ప్రజలు సహకరించి పన్ను బకాయిలు చెల్లించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు


తోటపాలెంలో భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

విజయనగరం టౌన్: కార్తీకమాసం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం వేకువ జాము నుంచి వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయం వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు నగేష్ శర్మ, వాసు శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. మహిళలు తులసి, ఉసిరి చెట్ల వద్ద దీపారాధనలు చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో కొలువైన వేంకటేశ్వర స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పీవీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కలువ పువ్వులతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. తోటపాలెం బాలాజీనగర్‌లో స్వామివారికి లక్ష తులసీ దళార్చనను ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం రంగాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. ఎస్వీఎన్ నగర్‌లో ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: కళాశాల విద్యార్థులకు మంజూరు చేసిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో పలువురు డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించడంలో జాప్యం కారణంగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు వివిధ రకాలుగా తమను ఇబ్బందులు పెడుతున్నాయని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్ మెంట్ ఫీజులను చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికైనా సిద్ధమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏబీవీపీ జిల్లా విభాగ్ కన్వీనర్ సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక

భోగాపురం: మండలంలోని బసవపాలెం సమీపంలో ఉన్న అవంతి రీసెర్చ్ అండ్ టెక్నలాజికల్ అకాడమిలో సవంథిస్ సొల్యూషన్ ఎల్ఎల్‌సీ హయిరింగ్ ఫర్ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ హెచ్ఆర్ ప్రతినిధులు మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో పాల్గొన్న 400 మంది విద్యార్థుల్లో నైపుణ్యం కలిగిన 22 మంది విద్యార్థులను గుర్తించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయాన్ని వినియోగించుకుని నైపుణ్యాలను సాధించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఐటీ కంపెనీలు మన రాష్ట్రానికి రానున్నాయని, అందువలన ప్రతి విద్యార్థి కష్టపడి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు, విద్యా సంస్థలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అవంతి కళాశాల ప్రిన్సిపాల్ సి.గోవిందరావు, అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజెజె.ప్రసాద్, హెచ్ఆర్ డైరెక్టర్ చంద్రశేఖర్, అవంతి సంస్థ ప్రతినిధి ఎం.మహేష్, ఏయూ అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్కరరావు, టీపీఓ టి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- డీఐజీ గోపీపినాథ్ జెట్టి


మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

పూసపాటిరేగ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలపై ఆరా తీశారు. అనంతరం మహిళాసంరక్షణ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి నేరం జరిగినా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మహిళాసంరక్షణ కార్యదర్శులదేనన్నారు. ఆయా గ్రామాల్లో నేరచరిత్ర ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను గుర్తించి సన్మార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని చెప్పారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడం నేరమని వచ్చిన పోస్టులును వేరే వ్యక్తులకు పంపించడం కూడా నేరమేనన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచి ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరగకుండా నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల చలామణి వివరాలు తెలిసినట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సీఐ డి.రామకృష్ణ, ఎస్సైలు ఐ.దుర్గాప్రసాద్, గణేష్, ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.